31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

బుధవారం,సెప్టెంబర్ 02,2026 పేజీలు : 8

## శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహణ




**చురకలు విలేఖరి కరీంనగర్, సెప్టెంబర్, 01 :** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, భజనలు, సంకీర్తనలు మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తారని అల్ఫోర్స్ విద్యాసంస్థల డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. శ్రీకృష్ణునికి వివిధ రకాల పూజా ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది వారు చెప్పారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.అర్ధరాత్రి శ్రీకృష్ణుడు జన్మించిన పవిత్ర సమయాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారని వారు చెప్పారు. ప్రత్యేక అలంకరణలు, పూజలు, భజనలు, సంకీర్తనలు, గీతా పారాయణం మరియు సాంస్కృతిక కార్యక్రమాలతో శ్రీకృష్ణుని -మిగతా 2లో



# సబ్‌ప్లాన్ నిధులను వినియోగించుకోవాలి

- అట్రాసిటీ బాధితులకు సత్వర పరిహారం, ఉద్యోగాలు అందేలా చర్యలు
- ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను నియామకాలు, పదోన్నతుల్లో తప్పనిసరిగా అమలు చేయాలి
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో శిక్షల శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 1 : ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయం తో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో అదనపు కలెక్టర్ లతతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ బకాయిలు, అంతర్ కుల వివాహ ప్రోత్సాహకాలు, పీఎం అజయ్ పథకం, అట్రాసిటీ చట్టంపై అవగాహన కార్యక్రమాలు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, మున్సిపల్ కార్మికులకు బీమా, 2బీహెచ్‌కే ఇళ్లు, పీఎం విశ్వకర్మ, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, ఎస్సీ, ఎస్టీ పంచాయతీల్లో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను నిర్ణీత సమయంలో ఎలాంటి జాప్యం లేకుండా జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్, కులాంతర వివాహ ప్రోత్సాహక పథకాలకు సంబంధించిన పెండింగ్ నిధులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ఎంత పరిహారం అందించారు, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారు అనే వివరాలతో సమగ్ర నివేదికను అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలు సమర్పించాలి.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన వివరాలను ప్రత్యేకంగా సమర్పించాలని కమిషన్ చైర్మన్ సూచించారు. ఎస్.డీ.ఎఫ్., సీ.డీ.పీ., ఎం.పీ. -మిగతా 2లో

## ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి

- మానవీయ కోణంలో సేవలు అందించాలి
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పథకాల అమలు, సంక్షేమం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో ఐడీఓసీలో సమీక్ష సమావేశం



**చురకలు ప్రతినిధి, సిరిసిల్ల, సెప్టెంబర్ -01:** జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్ జిల్లా పర్యటనకు రాగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె స్వాగతం పలికి.. పుష్పగుచ్ఛం అందజేశారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్ తో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పథకాల అమలు, సంక్షేమం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న పథకాలు, సంక్షేమం, అట్రాసిటీ కేసుల పరిష్కారం గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు అందేలా చర్యలు

-మిగతా 2లో

## పేదల పక్షపాతిగా వెయ్యి రోజుల పాలన

- సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి
- జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 1:** పేదల పక్షపాతిగా వెయ్యి రోజుల పాలన సాగిందని, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి చెందుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం జగిత్యాల మోతే రోడ్డులోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో వెయ్యి రోజుల ప్రజా పాలన సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమాన్ని విస్తరిస్తూ, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. రైతులకు భరోసా, మహిళలకు సాధికారత, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ప్రపంచ స్థాయి మౌలిక వసతుల నిర్మాణం జరుగుతోందన్నారు.సన్న బియ్యం పంపిణీ, 21 వేల కోట్ల రుణమాఫీ, ఉచిత బస్సు, 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఏటీసీ సెంటర్లు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేశామని తెలిపారు. గత

-మిగతా 2లో

## మల్లన్న గుట్ట హరిహరక్షేత్రంకు పోటెత్తిన భక్తులు



**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబర్, 01 :** నిర్మల్ జిల్లా మల్లన్న గుట్ట హరిహరక్షేత్రంలో ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఈరోజు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. నిర్మల్ జిల్లాతో పాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రతి మంగళవారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ధర్మకర్తలు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ఎలాంటి కొరత లేకుండా వివిధ రకాల వంటకాలు, అన్నప్రసాదాన్ని ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శ్రీ అలోల్ల వినోదమ్మ-మురళీధర్ రెడ్డి, ఆలయ గురుస్వామి మూర్తి, సామల వేణుగోపాల్ రెడ్డి, గంద్రత్.రమేష్, యువరాజు, చించోలి శంకర్, కోట గంగాధర్, నాంపల్లి సంతోష్, దేవదాస్, రాజేశ్వర్, దేవేందర్ రెడ్డి, పురుషోత్తం, రాకేష్ గౌడ్, హన్మంతు రెడ్డి తదితరులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

**-ఏఐఎఫ్‌బీ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్‌కుమార్ డిమాండ్**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి జిల్లా) సెప్టెంబర్ 1 :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలతోపాటు అన్ని హామీల ను వెంటనే అమలు చేయాలని ఏఐఎఫ్‌బీ పట్టణ కన్వీనర్ కుక్క శ్రావణ్‌కుమార్ డిమాండ్ చేశారు.పెద్దపల్లి బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు.హామీలు అమలు చేయలేకపోతే ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని నిరసన వ్యక్తం చేశారు.మహిళలకు రూ.2,500, రూ.500కే గ్యాస్ సిలిండర్, పెన్షన్ల పెంపు, రైతు భరోసా,ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం తదితర హామీలను అమలు చేయాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయడంతోపాటు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కుక్క అశోక్, నూనె వెంకటేశ్, మహరాజ్,షఫీ,కుక్క చరణ్,ఒడ్డపల్లి తిరుమల్‌తోపాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణాష్టమి వేడుకలు...

**మొదటి పేజీ తరువాయి....**జన్మదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని చెప్పారు.వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధానంగా శ్రీకృష్ణుని జన్మ వృత్తాంతం ఆలోచింపజేసింది మరియు వారు విద్యార్థులందరికీ ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపి ఆ భగవంతుని యొక్క ఆశీస్సు లు ముందుకు పయనించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పేదల పక్షపాతిగా వెయ్యి రోజుల పాలన

**మొదటి పేజీ తరువాయి....**ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులమయం చేసినా వడ్డీలు చెల్లిస్తూనే అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.వెంటిలేటర్ పై ఉన్న కాంగ్రెస్ కు ఆక్సిజన్ లా రేవంత్ రెడ్డి పార్టీని అధికారంలోకి తెచ్చారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని, వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ దే అధికారమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, మున్సిపల్ చైర్మన్ వాణి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి, మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, నాయకులు మన్సూర్, గోలి శ్రీనివాస్, కొత్త మోహన్, తాటిపర్తి శరత్ రెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహణ

**మొదటి పేజీ తరువాయి...** ల్యాడ్స్ నిధులు మంజూరు చేసే సమయంలో ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గ్రామాలకు అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఎస్సీ ప్రాంతాల అభివృద్ధికి 15 శాతం, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధికి 10 శాతం నిధులు కేటాయించేలా చూడాలని తెలిపారు. కేటాయించిన నిధులతో పనులు సక్రమంగా చేపట్టకపోతే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రస్తుతం అందుబాటులో ఉన్న సుమారు రూ.2,500 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మంచి రహదారులు, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఎస్సీ, ఎస్టీ నిధులతో చేపట్టాల్సిన పనులకు అవసరమైన అంచనాలను ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ ఈఈలు సిద్ధం చేసి సమర్పించాలని, నిధులను సక్రమంగా వినియోగిస్తూ పనులను పూర్తి చేయాలని సూచించారు.ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల సమయంలో కూడా రిజర్వేషన్ రోస్టర్‌ను తప్పనిసరిగా పాటించాలని కమిషన్ చైర్మన్ స్పష్టం చేశారు. పదోన్నతుల్లో కూడా రోస్టర్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.జిల్లాలోని మూడు పట్టణ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల్లో పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు ఉన్నందున వారికి కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తరహాలో రూ.30 లక్షల బీమా కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు కూడా ఎస్.బి. ఐ. బ్యాంక్ ద్వారా బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు.అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి అవసరమైన అంచనాలను సిద్ధం చేసి పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ భవనాల అనంతరం మహిళా భవనాలు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ భవనాలను వీబీజీరాంజి కింద, పట్టణ ప్రాంతాల్లో సీడీపీ కింద ప్రతిపాదించాలని తెలిపారు.

ప్రతి అంగన్‌వాడీ కేంద్రం సొంత భవనంలో నిర్వహించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు.ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీకి పాల్పడే వారికి చట్టంపై భయం కలిగేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ అన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు, విచారణను సమర్థవంతంగా నిర్వహించి శిక్షల శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మండల కేంద్రాల్లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, తహసీల్దార్లు, ఎస్‌ఐలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. ఎక్కువ సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా కేంద్ర ప్రదేశాల్లో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలను రెవెన్యూ శాఖ అధికారులు ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు.ఎస్సీ, ఎస్టీ హత్య, అత్యాచార కేసుల్లో బాధిత కుటుంబాలకు 2బీహెచ్‌కే ఇళ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్మన్ సూచించారు.

హైదరాబాద్‌లో ఇప్పటికే ఈ విధానం అమలు చేస్తున్నామని, దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలో ఈ తరహా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ జిల్లాలో 85 కులాంతర వివాహ ప్రోత్సాహక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించి సుమారు రూ.2.42 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితుల్లో ఐదుగురికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. వారం రోజుల క్రితం 185 మంది బాధితులకు రూ.1.06 కోట్లకు పైగా పరిహారం విడుదలైందని, ఆ మొత్తం వెంటనే వారి ఖాతాల్లో జమ కానుందని తెలిపారు. మరో 91 మంది బాధితులకు రూ.69.45 లక్షల పరిహారం పెండింగ్‌లో ఉందని, ఉన్నతాధికారుల సమాచారం మేరకు వారంలోగా విడుదల కానుందని వివరించారు. పీఎం అజయ్ పథకం కింద 144 యూనిట్లు గ్రౌండింగ్ కాగా, మరో 30 యూనిట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద 317 యూనిట్ల లక్ష్యానికి గాను 219 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వివరించారు. గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జగిత్యాల జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచినట్లు అధికారులు తెలిపారు.అనంతరం అదనపు ఎస్పీ చేతన్ నితిన్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 973 ఎస్సీ, 138 ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో 870 కేసుల్లో ట్రూ ఎఫ్‌ఐఆర్ ఫైనలైజ్ కాగా, 787 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు వివరించారు. 295 కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదలైనట్లు తెలిపారు.ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు ప్రాధాన్యతతో తీసుకొని, పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మి నారాయణ, ప్రవీణ్, ఆర్డీవోలు, డిఎస్పీలు, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి శాఖ అధికారి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కిషోర్, సంబంధిత అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి

**మొదటి పేజీ తరువాయి...**
తీసుకోవాలని పేర్కొన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంఖ్య, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాల ఆర్థిక చేయూత, ఇందిరమ్మ ఇండ్లు, జాబ్ కార్డు కలిగిఉన్న ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న పని వివరాలను అధికారుల ద్వారా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు ఛార్జ్ షీట్ దాఖలు వివరాలు తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదయిన కేసుల దర్యాప్తు త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాధితులకు నష్ట పరిహారం అందేవిధంగా చూడాలని వివరించారు. ప్రతినెలా చివరి వారంలో మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు అందరూ సమావేశాల్లో పాల్గొని, ప్రజల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలుపరుస్తున్న పథకాలు, చట్టాల గురించి అవగాహన కల్పించాలని వివరించారు. ప్రజలకు మానవీయ కోణంలో సేవలు అందించాలని సూచించారు.ఖచ్చితంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఏవైనా అభివృద్ధికి సంబంధించి నిధులు పెండింగ్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి విడుదల అయ్యేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ ప్రజల అభ్యున్నతితో పాటు, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా మరింత కృషి చేయాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో లోని పారిశుధ్య కార్మికులకు ఎస్ బీ ఐ బ్యాంక్ ఖాతాలు తీయించాలని, దీంతో కార్మికులకు భీమా సౌకర్యం ఉందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సేవలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అభినందించారు. జిల్లా కలెక్టర్ అందరికీ ఒకే న్యాయం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు, ప్రజలకు అందిస్తున్న ఉత్తమ సేవలను కొనియాడారు. ఎస్సీ, ఎస్టీలకు మరింత ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. పోలీసులు, ఇతర శాఖల అధికారుల సేవలను అభినందించారు.

జిల్లా ఎస్పీ మహేశ్ బి గితె మాట్లాడుతూ.. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలు తెలియజేశారు. కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు వివరించారు. వివిధ దశల్లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం కలిగేలా చూస్తామని అన్నారు. కేసుల దర్యాప్తు పారదర్శకంగా చేపడతామని తెలిపారు.తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ కింద జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు 2,315 మంది ఎస్సీలు, 436 మంది ఎస్టీలకు ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. టీ ప్రైడ్ కింద గత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీలకు 233 యూనిట్లకు రూ.6 కోట్ల 90 లక్షలు, ఎస్టీలకు 76 యూనిట్లకు రూ.2కోట్ల 66 లక్షలు మంజూరు అయ్యాయని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కులాంతర వివాహాలు చేసుకున్న 44 మంది జంటలకు 2,50,000 వేల చొప్పున రూ. 1,10,00,000 బడ్జెట్ మంజూరు అయిందని తెలిపారు.

జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ ఆద్వర్యంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ లు 5 నిర్మాణాలు రూ 2 కోట్ల 25 లక్షలతో పనులు చేపట్టామని తెలిపారు.సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డిఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సంగీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు, వివిధ సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణికి గౌరవ డాక్టరేట్




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 1 :** ఉమ్మడి జిల్లాకు చెందిన సంగీత రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖగాయకురాలు అరికొంతం కృష్ణవేణి సేవలను గుర్తించి స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ అందించిన గౌరవ డాక్టరేట్ను బొగ్గులకుంటలోని తెలంగాణ సరస్వత భవన్లో జరిగిన కార్యక్రమంలో స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకులు ఆకుల రమేష్, గూడూరు చెన్నారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ గ్రహీత కృష్ణవేణి మాట్లాడుతూ ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా తాను చేస్తున్న సంగీత సేవను గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరింత అంకితభావంతో సేవలందిస్తూ సమాజ అభివృద్ధికి పునరంకితం అవుతానని వెల్లడించారు. అవార్డుల ప్రదానోత్సవంలో డా.పీ.జీ. సుదర్శన్, ప్రొ. కుంట సురేష్, ఆకుల మంజుల, మల్లం రమేష్ పాల్గొని వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత్ గౌరవ్ సమ్మాన్, గౌరవ డాక్టరేట్లు, గ్లోబల్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన కృష్ణవేణికి కవి కొత్త అనిల్ కుమార్, కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం అధినేత గుండేటి రాజు, రుద్రమ సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు డా. చిందం సునీత, శ్రీరామోజు సంగీత తదితరులు అభినందలు తెలిపారు.

## సంఘం అభివృద్ధికి నిధులు మంజూరు



**చురకలు విలేకరి, రాయికల్, సెప్టెంబర్ 1 :** రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన శాలివాహన సంఘ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కలిసి సంఘ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందించారు. స్పందించిన ఎమ్మెల్యే సంఘం అభివృద్ధికి 1లక్ష 50 వేలు నిధులు వెంటనే మంజూరు చేశారు. సంఘం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరుకి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. 1లక్ష 50 వేలు సంఘం అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను శాలివాహన( కుమ్మర) సంఘం సభ్యులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా కార్యదర్శి యం.ఏ.మోఖీద్, (శాలివాహన) కుమ్మర సంఘ అధ్యక్షులు గంగారాం, ఉపాధ్యక్షులు గంగశేఖర్, సంఘ సభ్యులు నర్సయ్య,బక్కన్న, శ్రీనివాస్,నాయకులు ఎంబారి వెంకటేష్,సాగర్ రావు స్పందన,వేముల సతీష్,దొబ్బల వేణు, శ్రీరాముల గణపతి,వేణు రావు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**చురకలు విలేఖరి వీణవంక సెప్టెంబర్ 01 :** వీణవంక మండలం హిమ్మత్నగర్ ఎంపీయుపీఎస్ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు గోపికమ్మల వేషాలతో శ్రీకృష్ణుని వేషాలతో ఆకట్టుకున్నాయి. ఉట్టికొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సర్పంచ్ జడల శ్రీకాంత్, హెచ్ఎం సత్యం ,ఉప సర్పంచ్ మ్యాక శ్రీనివాస్,చిలువేరు రమేష్, ఉపాధ్యాయులు వేణు, రవళి,రజిత,ప్రియాంక, అంగన్వాడి టీచర్ లావణ్య, స్వరూప పాల్గొన్నారు.

# బుగ్గారం తహసీల్దార్‌కు "జాతీయ అవార్డ్"

### -"నరేందుల భూమేశ్వర్" సేవలను గుర్తించిన "బహుజన సాహిత్య అకాడమీ"



**చురకలు విలేఖరి,బుగ్గారం, సెప్టెంబర్ 01 :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల తహసీల్దార్ "నరేందుల భూమేశ్వర్" బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డ్‌కు ఎంపికయ్యారు. గత 39 సంవత్సరాలకు పైగా ఉద్యోగ రీత్యా ఆయన అందించిన సేవలను బహుజన సాహిత్య అకాడమీ అనే జాతీయ సంస్థ గుర్తించింది. ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఈ అవార్డ్ ఎంపిక పత్రాన్ని జారీ చేశారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో సోమవారం రాత్రి ఇద్దరు జిల్లా అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత, బి.రాజాగౌడ్‌ల చేతుల మీదుగా బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ అవార్డ్ ల సెలెక్షన్ కమిటీ సభ్యులు "చుక్క గంగారెడ్డి"ఈ అవార్డ్ ఎంపిక పత్రాన్ని బుగ్గారం తహసీల్దార్ "నరేందుల భూమేశ్వర్"కు అందజేశారు. నరేందుల భూమేశ్వర్ 1987లో ఉద్యోగంలో చేరి 25 స్థానాలలో వివిధ హోదాల్లో ప్రజలకు అందించిన మెరుగైన సేవలను, ఆయన సత్ ప్రవర్తనను, సమయ స్ఫూర్తిని, ప్రజల నుండి, రైతుల నుండి పొందిన మన్ననలను అభిమానాన్ని, ఉన్నతాధికారుల ప్రశంసలను గుర్తించి ఈ అవార్డ్ కు ఎంపిక చేయడం జరిగిందని చుక్క గంగారెడ్డి ఆ సభలో వివరించారు. సెప్టెంబర్ 5న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమీ 19వ జాతీయ సదస్సు లో ఈ అవార్డుల ప్రధానోత్సవం ఉంటుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, బిలిగెట్స్ హాజరయ్యే ఈ జాతీయ అవార్డుల ప్రధానోత్సవ సభలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు "నల్లా రాధాకృష్ణ" చేతుల మీదుగా తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్ కు "బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డ్"ను అందజేయనున్నట్లు చుక్క గంగారెడ్డి తెలిపారు. కాగా... సోమవారం రాత్రి బుగ్గారం మండల తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్ పదవీ విరమణ మహోత్సవ సభ జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బిఎస్. లత, బి.రాజా గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి దేవిప్రసాద్, కలెక్టరేట్ ఎ.ఓ. ఇట్టియాల వెంకట కిషన్, జగిత్యాల ఆర్డీవో మధుసుధన్ గౌడ్, ఫార్మర్ ఎ.వో.పుప్పాల హనుమంతరావు ,కలెక్టరేట్ అధికారులు ముద్దం తిరుపతి తదితరులతో పాటు వివిధ మండలాల తహసీల్దార్ లు అబ్దుల్ మాజిద్, శ్రీనివాస్, ఇతరులు, డిప్యూటీ తహసీల్దార్ లు మండలోజు రాకేష్ తదితరులు సురేందర్ రావు, రాజేష్ యాదవ్,రమేష్,భూమేష్, జి.పి.ఓ.లు, బి.ఎల్.ఓ.లు,రేషన్ డీలర్లు,వివిధ శాఖల అధికారులు సిబ్బంది,ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు,భూమేశ్వర్ - వసంతల అభిమానులు, బంధుమిత్రులు , తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్ - వసంత ల సేవలను కొనియాడారు. అనంతరం జ్ఞాపికలు, పుష్ప గుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగాసత్కరించారు.

# సీఎం వ్యక్తిగత దూషణలతో ఆయన స్థాయి పెరగదు

### -మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 1 :** సీఎం రేవంత్ రెడ్డి వ్యక్తిగత దూషణలతో ఆయన స్థాయి పెరగదని, సీఎం చేసిన వ్యాఖ్యలకు సమాధానం ఆయన వెయ్యి రోజుల పాలనే తేటతెల్లం చేసిందని జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మైకు దొరికిన ప్రతిసారీ కేసీఆర్ పై అక్కసు వెళ్లగక్కడం, వ్యక్తిగత దూషణలకు దిగడం వల్ల రేవంత్ స్థాయి పెరగదని విమర్శించారు. తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ కు, రేవంత్ రెడ్డికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని, తెలంగాణ సాధనలో రేవంత్ పాత్ర ఏంటని ప్రశ్నించారు. రేవంత్ వెయ్యి జన్మలెత్తినా కేసీఆర్ తో సరితూగలేరన్నారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తానని చెప్పి వెయ్యి రోజులైనా ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై చిత్తశుద్ధి లేదని, పాలన ఎలా చేయాలో ఆలోచించడం పక్కనబెట్టి కేసీఆర్ కుటుంబాన్ని తిడుతూ కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ నిజంగా నందీశ్వరుడని, తెలంగాణ జాతిపిత అని, కేసీఆర్ పై నోరు పారేసుకోవడం సులభమే కానీ ఆయనలా పాలన చేయడం రేవంత్ వల్ల కాదన్నారు. అతి తక్కువ సమయంలో ప్రజలచే ఎక్కువ తిట్లు తిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డేనని, చిల్లర మాటలు మాని పాలనపై దృష్టి పెట్టాలని, సూర్యుడి మీద ఉమ్మితే తిరిగి తన మీదే పడుతుందని వ్యాఖ్యానించారు. ఏ ఊరికెళ్లినా మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, తెలంగాణకు కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని అన్నారు. కేసీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ తరపున డిమాండ్ చేశారు.

### ఫీజు రియంబర్స్మెంట్

## బకాయిలు విడుదల చేయాలి



**చురకలు విలేకరి,గొల్లపల్లి, సెప్టెంబర్1 :** రాష్ట్రంలో 30 లక్షల మంది విద్యార్థులకు చెల్లించాల్సిన 14 వేల కోట్ల రూపాయల్లో వెంటనే విడుదల చేయాలని ధర్మ సమాజ్ పార్టీ, బిసి,ఎస్టీ,ఎస్సీ జెఎసి సంయుక్త ఆధ్వర్యంలో గొల్లపల్లి తహసీల్దార్ మాజిద్‌కు నాయకులు వినతి పత్రం సమర్పించారు. తెలంగాణలో 30లక్షల మంది విద్యార్థులకి సంబంధించిన 14వేల కోట్ల రూపాయలు బకాయిలు ఉన్న కారణంగా,చెల్లింపు బకాయిలను, ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి, ఎస్టీ, ఎస్సీ జెఎసి గొల్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి బాలే అశోక్ పట్టణ అధ్యక్షులు శాతల్ల లక్ష్మణ్, మండల నాయకులు చిలుముల జానీ, బాలే రాజు, అరికిల్ల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యాలయంపై దాడిని ఖండిస్తున్నాం



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, సెప్టెంబర్ 1 :** హైదరాబాద్‌లోని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని బీజేపీ మెట్‌పల్లి మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం జగ్గాసాగర్ గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కార్యాలయంపై దాడి చేయడం కాంగ్రెస్ నాయకుల పిరికిపంద చర్య అని విమర్శించారు. బీజేపీ నాయకులు,కార్యకర్తలను రాజకీయంగా నేరుగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ నాయకులు పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీల మధ్య విభేదాలు సహజమేనని,అయితే కార్యాలయాలపై దాడులకు పాల్పడటం సరికాదనీ, ఇలాంటి దాడులను బీజేపీ కార్యకర్తలు ఐక్యంగా ఎదుర్కొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు మారు జనార్దన్‌రెడ్డి,జంగిటి శ్రీధర్, మెడిచేల్మల రవి,కాటిపల్లి సురేష్ రెడ్డి,బీజేపీ నాయకులు గంట రాజేశ్వర్, నలిమెల నరసింహారెడ్డి, చిలువేరు మల్లేష్,సబ్బని అశోక్,జిన్న శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కన్నాపూర్‌లో వన మహోత్సవం



**చురకలు విలేకరి,జగిత్యాల, సెప్టెంబర్ 1 :** వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ గ్రామంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ మొక్కను నాటి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.నాటిన ప్రతి మొక్కను సంరక్షించి,వాటి పెరుగుదలకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్,గ్రామ పంచాయతీ కార్యదర్శి,గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అర్హతలు పరిశీలన



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (01) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని బర్దిపుర్ గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల అర్హతలను మంగళవారం ఇబ్రహింపట్నం మండల వ్యవసాయశాఖ అధికారి అకు రాజ్‌కుమార్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారుల కుటుంబ వివరాలు,నివాస పరిస్థితులు,ఇళ్ల స్థితిగతులను పరిశీలించి, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అర్హతలను నిర్ధారించే ప్రక్రియ చేపట్టారు.అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని, లబ్ధిదారులు అర్హతల పరిశీలనకు అవసరమైన వివరాలు,పత్రాలను అధికారులకు అందించలన్నారు. ఈకార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి దివకర్,కారోబార్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పురుగుమందు దుకాణం తనిఖీ



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (01) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్ పురుగుమందుల దుకాణాన్ని ఇబ్రహింపట్నం మండల వ్యవసాయ అధికారి అకు రాజ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. దుకాణంలోని పురుగుమందుల నిల్వలు,విక్రయ రికార్డులు,బిల్లులు,లైసెన్స్‌తో పాటు ఇతర సంబంధిత రికార్డులను పరిశీలించారు. నాణ్యత నిర్ధారణలో భాగంగా మూడు రకాల పురుగుమందుల నమూనాలను సేకరించి ప్రయోగశాల పరీక్షలకు పంపేందుకు చర్యలు చేపట్టారు. రైతులకు నాణ్యమైన పురుగుమందులను మాత్రమే విక్రయించాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు.పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని,లేబుల్‌పై సూచించిన మోతాదు,విధానం ప్రకారం మాత్రమే మందులను వినియోగించాలని వ్యవసాయ అధికారి సూచించారు.

# జగిత్యాలలో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి

### -పెట్రోల్ బంక్ వివాదంపై సీఎంకు మాజీ మంత్రి జీవన్ రెడ్డి లేఖ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 1:** జగిత్యాల పట్టణంలో పెట్రోల్-డీజిల్ ఔట్ లెట్ ఏర్పాటులో నెలకొన్న వివాదాల పరిష్కారానికి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.జీవన్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. జగిత్యాలలో పోలీస్ శాఖ వారి సంక్షేమార్థం పాత బస్టాండ్ కూడలిలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు విధి విధానాల ప్రకారం టెండర్ ప్రక్రియ ద్వారా సంకల్పించి దాదాపు 3 ఏళ్లు గడుస్తున్నా ఫైనల్ చేయకుండా, జిల్లా కలెక్టర్ ఏకపక్షంగా ఎటువంటి టెండర్ పిలవకుండా 10 అడుగుల షాపుకు నెలకు రూ.25 వేలు అద్దె ఉండగా, 66 అడుగుల స్థలాన్ని నామమాత్రంగా రూ.72 వేలకు పెట్రోల్ పంపు కు కేటాయించడం వివాదాస్పదమైందని పేర్కొన్నారు. 1960కి పూర్వం నుండి జగిత్యాలలో పెట్రోల్ బంక్ లేని పరిస్థితుల్లో న్యూ బస్టాండ్ సమీపాన మున్సిపల్ కు చెందిన సర్వే నం.138 లో 0-20 గుంటలు కేటాయించగా, వాస్తవంగా 0-04 గుంటల్లోనే బంక్ నడుస్తూ, మిగతా 0-16 గుంటల్లో వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని, దీనిపై హైకోర్టు డివిజన్ బెంచ్ డబ్ల్యూ.పి. నం : 1650, 1664/2008 ద్వారా టైటిల్ నిర్ధారణతో ఆక్రమణలు తొలగించి మున్సిపల్ స్వాధీనం చేసుకోవాలని తీర్పు ఇచ్చి 15 ఏళ్లు గడిచినా అమలు కాలేదని తెలిపారు. సర్వే నం.138 లోని 0-16 గుంటల ఆక్రమణ తొలగించి మున్సిపల్ స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టాలని, నూతనంగా ఏర్పాటు చేయాలనుకున్న పెట్రోల్ ఔట్ లెట్ ను ప్రజా సౌకర్యార్థం పాత బస్ స్టాండ్ సమీపాన పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసేందుకు తగు నిర్ణయం తీసుకోవాలన్నారు.పురాతన తహసీల్ కార్యాలయ భవనాన్ని తొలగించి, పారదర్శకత, టెండర్ ప్రక్రియ లేకుండా నామమాత్రపు అద్దెతో ప్రభుత్వ ఆస్తిని ధారాదత్తం చేయడంపై ఉన్నత స్థాయి విచారణ చేపట్టి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఎస్ఐఆర్ నోటీసుల వివరాలు వెంటనే

# ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి

### - ఇబ్రహింపట్నం తహశీల్దార్ వరప్రసాద్



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (01) :** ఎస్ఐఆర్ నోటీసుల వివరాలు వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల తహశీల్దార్ వరప్రసాద్ అన్నారు. మంగళవారం మండలం లోని ఫకిర్ కోండాపూర్ గ్రామంలో ఎస్ఐఆర్ నోటీసులు అందజేసిన వెంటనే వాటికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తహశీల్దార్ వరప్రసాద్ బీఎల్‌ఓలకు సూచించారు. గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. బీఎల్‌ఓల పనితీరును పరిశీలించిన నోటీసులు అందజేసిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి జాప్యం లేకుండా, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తోట రమేష్, బీఎల్‌ఓ రత్నమాల, నాయకులు సింగని మారుతి తదితరులు పాల్గొన్నారు.

### ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన

# పారదర్శకంగా పూర్తి చేయాలి

### -జిల్లా అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ బి. రాజ గౌడ్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, సెప్టెంబర్ 1:** ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు స్థానిక సంస్థల కలెక్టర్ బి. రాజ గౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జగిత్యాల మండలం మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కింద వచ్చిన దరఖాస్తులను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి అందిన దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను సంబంధిత స్థలాల్లో పరిశీలించారు. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలు, స్థల పరిస్థితి, లేఅవుట్‌కు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వాస్తవ పరిస్థితులను పూర్తిగా నమోదు చేసి, అర్హత కలిగిన దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించిన వివరాలను టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి తదితర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి,సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఖ్యను పెంచాలి

**-భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి**
**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష**



**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, సెప్టెంబర్ 01 :** జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఖ్యను పెంచాలని, సూచించిన తేదీలోగా రీసర్వే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూముల రీసర్వే ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. గంభీరావుపేట మండలం శ్రీనివాసపురం, వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి, కోనరావుపేట మండలం లచ్చపేట, చందుర్తి మండలం అనంతపల్లి సర్వే పూర్తి కాగా, బోయినిపల్లి మండలం కొత్తపేట, రుద్రంగి మండలం రుద్రంగి, ఇల్లంతకుంట మండలం సిరికొండ, తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్, ముస్తాబాద్ మండలం తుర్కపల్లి, ఎల్లారెడ్డిపేట మండలం సర్వాయిపల్లి, వీర్నపల్లి మండలం గర్జనపల్లి, గంభీరావుపేట మండలం ఖుర్దు లింగంపల్లి, కోనరావుపేట మండలం మర్తనపేట, సిరిసిల్ల మండలం పెద్దూర్ గ్రామాల్లో భూముల రీసర్వే ప్రక్రియ కొనసాగుతుంది. గ్రామాల సరిహద్దు సర్వే సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా చేపట్టాలని, భూములకు సంబంధించిన సమాచారం పక్కాగా సేకరించి, నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత జిల్లా అధికారి, డీఐలు భూముల రీసర్వే చేపడుతున్న గ్రామాలలో పర్యటించి, ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఖ్యను పెంచాలని, అందుకు సరిపడా రోవర్ యంత్రాలను సమకూర్చుకోవాలని అన్నారు. భూములకు సంబంధించిన సమాచారం తప్పులు లేకుండా, పకడ్బందీగా సేకరించాలని ఆదేశించారు. సమావేశంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, డిఐలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నాయకులను ప్రజలు నిలదీయాలి

**-బిఆర్ఎస్ పార్టీవి పసలేని ఆందోళనలు**
**-సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డి పేట సెప్టెంబర్ 01 :** 10 సంవత్సరాల లో ఏమి చేశారని ప్రజలు బిఆర్ఎస్ పార్టీ నాయకులను నిలదీయాలని ఎల్లారెడ్డిపేట మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కార్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించినందుకా 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నందుకా మహిళా సంఘాలకు పావుల వడ్డీ ఇస్తున్నందుకా ప్రతినెల సన్నబియ్యం ఇస్తున్నందుకా రేషన్ కార్డులు లేని వారికి రేషన్ కార్డులు ఇస్తున్నందుకా ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నందుకా మీ ఆందోళన ప్రజలకు జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తామని చేయలేదు దళితులకు మూడెకరాల వ్యవసాయ భూమి ఇస్తామని ఇవ్వలేదు 10 సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు రాష్ట్రాన్ని అన్ని విధల దోసుకుని దాసుకున్నారు దేనికి మీ ఆందోళన అని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల కాలంలో నిరుద్యోగులకు 70వేలకు పైగా ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయడం జరిగిందని రైతు లకు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా ఇస్తున్నామని మహిళా సంఘాలకు పావుల వడ్డీ రుణాలు ఇస్తామని చెప్పి ఎగ్గొట్టిన ఘనత బిఆర్ఎస్ పార్టీ కేసీఆర్ కే దక్కింది ఆయన విమర్శించారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు పెట్రోల్ బంకులు సూపర్ మార్కెట్లు ఎరువుల దుకాణాలు రేషన్ షాపులు బస్సులు రైసు మిల్లులు ఇస్తున్నామన్నారు, కేంద్ర ప్రభుత్వము రైతులకు ఎరువులు పంపిణీ చేసే విషయంలో ఇబ్బందులు పెడుతుందని ఆయన విమర్శించారు, ఇబ్బందులను తొలగించి అవసరం ఉన్న మేరకు ఎరువులు సరఫరా చేసే బాధ్యత బిజెపి పార్టీ తీసుకోవాలన్నారు. బిజెపి పార్టీ నాయకులు తో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు కుమ్మక్కయ్యారని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ 10 సంవత్సరాల్లో చేసింది ఏమిటి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కార్ మూడు సంవత్స రాల కాలంలో చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలు గమనిస్తున్నారన్నారు, బి ఆర్ ఎస్ పార్టీ అనవసరమైన ఆందోళన చేస్తుందని వారివి పసలేని ఆందోళన లని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ మండల మాజీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ గుండాడి రామిరెడ్డి పట్టణ అధ్యక్షులు చెన్ని బాబు కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండాపురం శ్రీనివాస్ రెడ్డి బండారి బాల్రెడ్డి గంట బుచ్చాగౌడ్ పాల్గొన్నారు.

# రామగుండంలో 124 శాతం బొగ్గు ఉత్పత్తి

**-కార్మికుల రక్షణకు కట్టుబడి ఉన్నాం**
**-జిఎం లలిత్ కుమార్**




**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (గోదావరిఖని) సెప్టెంబర్ 1 :** సింగరేణి సంస్థ రామగుండం ఏరియా-1లోరికార్డ్ స్థాయిలోబొగ్గు ఉత్పత్తులను సాధించింది .ఆర్జీ-1 పరిధిలోని బొగ్గు గనులు, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో 124% బొగ్గు ఉత్పత్తి చేపట్టినట్లు జిఎండి లలిత్ కుమార్ తెలిపారు. పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనిలోని సింగరేణి జిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ ఆగస్టు మాసం కు సంబంధించిన ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. 2,45,200 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి 3,04,086 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు వివరించారు. రామగుండం ఏరియా నుండి 2,45,200 టన్నుల బొగ్గు రవాణా లక్ష్యానికి గాను 2,50,739 టన్నుల బొగ్గు రవాణా తో 102% రవాణా చేపట్టినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా జీడీకే-1,3 బొగ్గు గనుల్లో 64%, జీడికే-2, 2ఏ బొగ్గు గనిలో 71 శాతం, జీడికే-1 1ఏ గనిలో 298% సాధించినట్లు లలిత్ కుమార్ స్పష్టం చేశారు. ఈ ఏడాది నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించే దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కార్మికుల రక్షణకు పూర్తిస్థాయిలో కట్టుబడి ఉన్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం కోసమే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. సింగరించే చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేస్తామని జిఎం లలిత్ కుమార్ పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు చంద్రశేఖర్, రెడ్డి మల్ల తిరుపతి,ఆంజనేయులు, జితేందర్ సింగ్,వేణు,హనుమంతరావు,వీరారెడ్డి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌జీ-3, ఏపీఏ
# క్రీడా సమన్వయకర్తగా బూర్ల సదానందం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ సెప్టెంబర్ 1 :** సింగరేణి ఆర్‌జీ-3, అడ్రియాల ప్రాజెక్టు (ఏపీఏ) ఏరియాల 2026-27 వార్షిక క్రీడల నిర్వహణ కోసం క్రీడా కమిటీని ఆర్‌జీ-3 ఏరియా జీఎం ఎస్.మధుసూదన్ ప్రకటించారు. ఓసీపీ-2లో ఈపీ ఎలక్ట్రిషియన్‌గా విధులు నిర్వహిస్తున్న బూర్ల సదానందను క్రీడా సమన్వయకర్తగా నియమించారు. గత 30 సంవత్సరాలుగా హాకీ క్రీడాకారుడిగా సింగరేణి సంస్థకు ప్రాతినిధ్యం వహిస్తున్న బూర్ల సదానందం, దేశవ్యాప్తంగా వివిధ కోల్ కంపెనీలు నిర్వహించిన కోల్ ఇండియా క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. పలుమార్లు సింగరేణి జట్టు పతకాలు సాధించడంలో కీలకపాత్ర పోషించారు. తన క్రీడా ప్రతిభతో 'ఎమర్జింగ్ ప్లేయర్', 'బెస్ట్ ప్లేయర్' అవార్డులను సైతం అందుకున్నారు. ఆయనకు 'నల్లవజ్రం' పురస్కారం కూడా లభించింది. అనుభవజ్ఞుడైన క్రీడాకారుడిని క్రీడా సమన్వయకర్తగా నియమించడం పట్ల క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ సదానందకు అభినందనలు తెలిపారు. అలాగే కే.ఎల్.ఎన్.ప్రసాద్, వీర్ల సంపత్, గంధం శ్రీనివాస్, హఫీజుద్దీన్, వి.వి.గౌడ్, సారయ్య, నర్సింహారెడ్డి, సత్యనారాయణ, డి.శ్రీనివాస్, నారాయణ, చంద్రశేఖర్ రెడ్డికి వివిధ క్రీడల నాయకత్వ బాధ్యతలను అప్పగించారు. వారి నియామకం పట్ల ఆర్‌జీ-3, ఏపీఏ ఏరియాల క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా 2026-27 వార్షిక క్రీడలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి.

# రేవంత్ రెడ్డి, శ్రీధర్ బాబు చిత్రపటాలకు పాలాభిషేకం

**-16న ఆర్ట్స్ కాలేజీ సభ విజయవంతం చేయండి**



**చురకలు ప్రతినిధి,మంథని,సెప్టెంబర్ 1 :** తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం,గుర్తింపు కార్డు,పెన్షన్, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఆరోగ్య పథకం అమలుతో పాటు కేకే కమిటీ సిఫార్సులను అమలు చేయడానికి అంగీకరించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం మంథని లో పాలాభిషేకం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి కావటి సతీష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు చిత్రపటాలకు స్థానిక అంబేద్కర్ చౌక్ లో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే సెప్టెంబర్ 16న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు కావటి సతీష్ తెలిపారు. ఈ సభకు తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మిరాల రామిరెడ్డి, సాదుల శ్రీను, అజీమ్ ఖాన్, ఎస్.కె. ముజీబ్, ముస్కె ఈశ్వరమ్మ, కాసిపేట మల్లేష్, సుధాకర్, దాసరి శంకర్, తోకల మల్లేష్, మధుకర్ రెడ్డి, ఆనంద్, అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## సిపి గౌష్ఆలంను ఆత్మీయంగా సన్మానించిన సున్నీ మర్కజి మీలాద్ కమిటీ

**-పోలీసు శాఖకు హృదయ పూర్వక కృతజ్ఞతలు**



**చురకలు విలేఖరి,కరీంనగర్, ఆగస్టు 31 :** మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా నగరంలో ఇటీవల నగరంలో నిర్వహించిన మిలాదున్నబి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు,శాంతి ర్యాలీకి, సహాయ సహకారాలు అందించిన పోలీసు కమిషనర్ గౌష్ ఆలంను ఆయన క్యాంపు కార్యాలయంలో, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ అధ్యక్షుడు హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, వ బజ్మే అఫ్జల్ బియాబాని అధ్యక్షుడు మౌలానా అలీముద్దీన్ నిజామీ బియాబాని ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు,మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భం గా వారు మాట్లాడుతూ..పోలీసు శాఖ ఇచ్చిన గడువు ప్రకారం, సరైన సమయానికి, పోలీసులు సూచనలు పాటిస్తూ, ఎలాంటి ఆటంకాలు లేకుండా మిలాదున్నబి జల్సా, నాత్, దరూద్ కి మహిఫిల్,ఖసీదా బుర్దా షరీఫ్ సదస్సులు నిర్వహించి ఆదర్శంగా నిలిచామన్నారు. యావత్తు పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో కమిటీ సభ్యులు మౌలానా ఖయ్యూం జియాయి,మౌలానా అబుల్ కలాం మిస్బాహి,సయ్యద్ అబ్బాస్ హుస్సేన్, సలావుద్దీన్, ఆయుబ్ ఖాన్,నూరి,జియా,తఖీ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేయకుంటే పతనం తప్పదు

**-మాతంగి శంకర్ సిపిఎం పార్టీ కార్యదర్శి**



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ సెప్టెంబర్ 01 :** గత ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయలని సిపిఎం పార్టీ తిమ్మాపూర్ మండల కార్యదర్శి కామ్రేడ్ మాతంగి శంకర్ డిమాండ్ చేశారు.మంగళవారం తిమ్మాపూర్ మండల తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు. అనంతరం పార్టీ కార్యదర్శి మాతంగి శంకర్ మాట్లాడుతు గత ఎన్నికల్లో అనేక బూటకపు హామీలతో ప్రజలను మభ్యపెట్టి,,డబ్బు మద్యం,పంపిణీ తో అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో తిమ్మాపూర్ నుండి పోరండ్ల వరకు డబుల్ సిసి రోడ్డు కోరకు మంజురైన రెండు కోట్ల రూపాయలను ఇప్పటివరకు ఖర్చు చేయకపోవడం ప్రభుత్వం చాతకానీ తనానికి నిదర్శనం అన్నారు. రెండుసార్లు కొబ్బరి కాయలు కొట్టిన ఎమ్మెల్యే,నాయకులు పనులు చేయడం మాత్రం మరిచి పొయారని ఆవేదన వ్యక్తంచేశారు. రెండున్నర సంవత్సరాలుగా తెలంగాణలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని అన్నారు.ప్రైవేటు స్కూల్స్, కాలేజీల్లో ఫీజుల దోపిడీని అరికట్టేందుకు తక్షణమే ఫీజుల నియంత్రణ చట్టం తెవాలని డిమాండ్ చేశారు.రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు.పెంచిన కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించి , యాప్ లేకుండా సోసైటిల ద్వారా డైరెక్ట్ గా తీసుకునే విధంగా అందుబాటులో ఉంచాలన్నారు.కళ్యాణలక్ష్మీ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఇచ్చిన హామీ ప్రకారం స్వంత జాగలేని పెదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్య, వైద్యాన్ని రంగాన్ని బలోపెతం చెయ్యాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే అన్ని పార్టీలను,వర్గాల ప్రజలను రాజకీయాలకు అతీతంగా ఏకం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మాతంగి వెంకటస్వామి,మాతంగి రాజయ్య,గోపు అయిలయ్య, బోల్ల మొగిళి, మాతంగి రాయమల్లు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాపాలనకు 1000 రోజులు..

# తెలంగాణలో సంక్షేమం, అభివృద్ధికి స్వర్ణయుగం

**-వేములవాడ అభివృద్ధికి ఆది శ్రీనివాస్ అహర్నిశలు కృషి**

**-అన్నా' అంటే 'నేనున్నా' అంటూ కార్యకర్తకు అండగా నిలిచే జననాయకుడు ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి**

**-కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, వేములవాడ సీనియర్ నాయకుడు కూరగాయల కొమురయ్య**



**చురకలు ప్రతినిధి,సిరిసిల్ల సెప్టెంబర్ 01 :** ప్రజాపాలన 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు,ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, వేములవాడ సీనియర్ నాయకుడు కూరగాయల కొమురయ్య హృదయపూర్వక శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణలో ప్రజా పాలనకు కొత్త నిర్వచనం లభించిందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలు,రైతులు,మహిళలు, యువత, విద్యార్థులు,కార్మికులు,బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని తెలిపారు.కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టు కుంటున్న ప్రభుత్వం ఇది అని అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రూ. 500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ మహిళల కుటుంబ భారం తగ్గించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నరకం ధాన్యానికి బోనస్, ధాన్యం కొనుగోళ్లు వంటి కార్యక్రమాలతో రైతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలిచింద న్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తోందన్నారు.యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం వంటి కార్యక్రమాలు,పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.మహిళా సంఘాలను బలోపేతం చేస్తూ మహిళలను ఆర్థికంగా స్వావలంబన దిశగా నడిపిస్తోందని తెలిపారు.

**వేములవాడ అభివృద్ధికి ఆది శ్రీనివాస్ ఒక ప్రత్యేక శక్తి**

వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తు న్నారని కూరగాయల కొమురయ్య అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధికి దిశానిర్దేశం చేస్తుంటే వేములవాడ నియోజకవర్గం లో ఆది శ్రీనివాస్ ఆ అభివృద్ధిని ప్రజల గడప వద్దకు తీసుకెళ్లే బాధ్యతను భుజాన వేసుకున్నారని అన్నారు.

**కార్యకర్తకు కష్టం వస్తే.. 'నేనున్నా' అనే నాయకుడు**

"అన్నా" అని కార్యకర్త పిలిస్తే.. "నేనున్నా" అంటూ భరోసా ఇచ్చే నాయకుడు ఆది శ్రీనివాస్ అని అన్నారు.కార్యకర్త కష్టంలో ఉన్నప్పుడు ముందుండి అండగా నిలబడటం, కార్యకర్తల సమస్యలను తన సమస్యలు గా భావించి పరిష్కరించేందుకు ప్రయత్నించడం ఆయనకు సహజ స్వభావమన్నారు.పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తను గుర్తించి గౌరవించే నాయకత్వం ఆది శ్రీనివాస్‌దని, అందుకే ఆయనకు కార్యకర్తల నుంచి అపారమైన అభిమానం,ప్రజల నుంచి విశ్వాసం లభిస్తోందని అన్నారు.

**అధిష్టానం గుర్తించాల్సిన సమయం వచ్చింది**

ప్రభుత్వవిప్‌గా పార్టీకి,ప్రభుత్వానికి సమన్వయకర్తగా పనిచేస్తూ.. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఆది శ్రీనివాస్‌కు భవిష్యత్తు లో మరింత కీలకమైన బాధ్యతలు అప్పగించాలని కోరారు. రాజన్న ఆశీస్సులతో.. రేవంత్ రెడ్డి నాయకత్వంలో.. ఆది శ్రీనివాస్ సారథ్యంలో వేములవాడ నియోజకవర్గం అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్లు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. విలేకరుల సమావేశంలో వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలుక రమేష్, రాకేష్, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు,

# పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**-జిల్లాలో నేరాలు 4 శాతం తగ్గాయి**



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ సెప్టెంబర్ 01 :** కరీంనగర్ జిల్లాలో వినాయక చవితితో పాటు దసరా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కరీంనగర్ సీపీ గౌస్ అలాం కోరారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళ వారం సీపీ గౌస్ అలాం ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. నేరస్థుల రికార్డులను,క్రైమ్ రికార్డులను, సీజ్ చేసిన ప్రాపర్టీని, స్టేషన్ నిర్వహణ, పరిసరాలను పరిశీలించి సీఐ, ఎస్సై, సిబ్బందిని సీపీ అభినందించారు. పోలీసుల డ్రిల్ ను పరిశీలించారు. సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు.పోలీసులను ఒక్కొక్కరిని వ్యక్తిగతంగా పిలిచి వారి సమస్యలను అడిగి తీసుకున్నారు. అన్ని గ్రామాల్లో సిసీ కెమెరాల సంఖ్యను పెంచాలని, అన్ని పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో 4 శాతం నేరాలు తగ్గాయని కరీంనగర్ సీపీ గౌస్ అలాం తెలిపారు. సైబర్ నేరాలు, హత్యలు, నార్కోటిక్ కేసులు, మహిళా ఫిర్యాదు కేసుల నేరాలు పెరిగినట్లు, రోడ్డు ప్రమాదాల సంఖ్య సమానంగా ఉందని తెలిపారు. జిల్లాలో పదోన్నతుల కోసం లూప్ లైన్ పోస్టులకు వెళ్లడంతో పోలీసు అధికారుల కొరత ఉందన్నారు. జనాభా తక్కువ ఉన్న దృష్ట్యా ఎల్ఎండి పోలీస్ స్టేషన్ అప్గ్రేడ్ ప్రతిపాదన లేదన్నారు.ఇసుక అక్రమ రవాణా చేస్తూ మూడు కి పైగా కేసులు ఉంటే షీట్స్ తీరుస్తున్నా మని తెలిపారు. నేరాల నియంత్రణకు పోలీస్ ఎన్ఫోర్స్మెంట్ తరచూ చేపడుతు న్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్, కుమార్ తిమ్మాపూర్ సిఐ బోల్లం రమేష్, ఎల్ఎండి ఎస్ఐ అన్వర్, సిబ్బంది పాల్గొన్నారు.





# బాలికలు తమ కాళ్ళమీద నిలబడాలన్నదే సత్యసాయి సంకల్పం

### -6నుండి పీహెచ్డీ వరకు బాలికలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య




**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 1 :** గ్రామీణ, పట్టణ ప్రాంతాలోని పేద బాలికలు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సత్యసాయి విద్య మిషన్ ఉచిత విద్యను అందిస్తుందని తెలంగాణలోని సిద్దిపేట జిల్లా కొండపాక సత్యసాయి విద్య మిషన్ సిఎస్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ కె. సునయన అన్నారు. సత్యసాయిబాబా స్థాపించిన వన్ వరల్డ్ - వన్ ఫ్యామిలీ వసుదైక కుటుంబం అనే ఉన్నత సంకల్పంతో సత్యసాయి విద్యా మిషన్ తెలంగాణలో విద్యా విప్లవాన్ని సృష్టిస్తోందని ఆమె పేర్కొన్నారు.సత్యసాయిబాబా శిష్యులు మధుసూదన సాయి ఆశయాలతో, సిద్దిపేట జిల్లా కొండపాకలో ప్రారంభమైన సత్యసాయి విద్యా మిషన్ ఇప్పుడు జగిత్యాలకు విస్తరించిందని తెలిపారు.మంగళవారం కొండపాక క్యాంపస్ అసిస్టెంట్ మేనేజర్ సునయన, కామర్స్ లెక్చరర్ స్వప్న, లెక్చరర్ జయశ్రీ, కంప్యూటర్ లెక్చరర్ హర్షితలు జగిత్యాలలోని అయ్యప్ప స్వామి ఆలయంలో పేరెంట్స్ తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సునయన, స్వప్న లు మాట్లాడుతూ 2018 లో కొండపాకలో మొదలయిందని ఇప్పుడు 151 మంది బాలికలు వివిధ తరగతుల్లో విద్యను అభ్యశిస్తున్నారని తెలిపారు.6 వ తరగతి నుండి ఇంటర్, డిగ్రీ, పీజీ, పిహెచ్డీ వరకు ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో ఆధ్యాత్మిక వాతావరణంలో విద్యను అందిస్తున్నామని స్పష్టం చేశారు.ఇక్కడ మేము చేస్తున్నది కేవలం విద్య కాదు, ఒక మహా యజ్ఞం అని వివరించారు. ప్రతి విద్యార్థికి విద్యతో పాటు డ్రెస్, పుస్తకాలతో పాటు నిత్య జీవితంలో అవసరమాయ్యే వస్తువులు అందిస్తున్నామని, ఏడాదికి లక్ష రూపాయలు ఖర్చు చేస్తున్నామని, దానికి తగ్గట్టు బాలికలు ఉన్నతంగా రాణిస్తూ ఆడ సింహాలుగా తయారయ్యారని సునయన , స్వప్నలు తెలిపారు. విద్యతో పాటు ఉచిత వైద్యం, పోషకహారాన్ని అందిస్తున్నామన్నారు.

**ప్రత్యేకత సంస్కార విద్య**

ప్రభుత్వపరంగా వివిధ రకాల విద్యాలయాలు ఉన్నప్పటికీ, మేము ఎంచుకున్నది జగిత్యాలను మాత్రమేనని, ఇక్కడి బాలికలకు పూర్తి ఉచితంగా విద్యను అందించాలని నిర్ణయించామని వారు తెలిపారు.సత్యసాయి ట్రస్ట్ ప్రత్యేకత ఏమిటంటే-మార్కులతో కూడిన చదువుతో పాటు, మహాభారతం, రామాయణం వంటి భారతీయ ఇతిహాసాలు,ఉపనిషత్తులతో నైతిక విలువలతో కూడిన సంస్కార విద్యను బోధిస్తున్నామని తెలిపారు.దీని ద్వారా పిల్లల్లో అద్భుతమైన మార్పు వచ్చిందన్నారు.పిల్లలకు బేసిక్ ఉన్న విద్యను బోదిస్తున్నామని, పిల్లల్లో బేధభిప్రాయాలూ లేవని అందరిని ఒకేలా చూస్తున్నామన్నారు.అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదన్న సత్యసాయి బాబా సంకల్పాన్ని, వన్ వరల్డ్ - వన్ ఫ్యామిలీ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్తామని వారు స్పష్టం చేశారు.ఇక్కడ చదివి ఉన్నతంగా రానించి ఉద్యోగం కోసం విద్యను బోధించడానికి విద్యార్థులే రిటర్న్ గా క్యాంపస్కు వస్తున్నారని పేర్కొన్నారు. బాలికలు ఉద్యోగాలు చేసి జీవితాన్ని ఎలా డీల్ చేయాలో ఈ విద్య మిషన్ లో నేర్పుతామని చెప్పారు. అనంతరం సత్యసాయి కొండపాక విద్య మిషన్ క్యాంపస్ లెక్చరర్లను అయ్యప్ప స్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సమావేశంలో మధుసూదన సాయి గ్లోబల్ మిషన్ కో ఆర్డినేటర్ పూటూరి శ్రీకాంత్, గురు స్వాములు బండారి లక్ష్మీనారాయణ,నీలం దశరథ రెడ్డి, మానాల కిషన్,ప్రభాకర్,బాలు, పూజారి లక్ష్మీపతి, పేరెంట్స్ పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

### -టీజీఈజేసి జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో నిరసనలు




**చురకలు విలేకరి, జగిత్యాల, సెప్టెంబర్ 1:** పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా టీజీ ఈ జేసీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కా ర్యాలయం ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయులు,పెన్షనర్లు మంగళవారం కలెక్టర్ కా ర్యాలయం ఎదుట నల్ల బాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా చైర్మన్ మిర్యాలనాగేందర్ రెడ్డి, కన్వీనర్ కందుకూరు రవి బాబు, ట్రెసా అధ్యక్షులు ఎం.డీ.వకీల్, పెన్షనర్ల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ సీపిఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని, పెండింగ్ లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, హెల్త్ కార్డులు పటిష్టంగా అమలు చేయాలని , పీ ఆర్ సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 10 న చలో హైదరాబాద్ కు అత్యధిక సంఖ్య లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు హాజరు అయ్యి విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీ ఎన్ జీవో జిల్లా కార్యదర్శి అమరేందర్ రెడ్డి, కోశాధికారి షాహెద్ బాబా పెన్షనర్ల జిల్లా కార్యదర్శి పి. సి హన్మంత్ రెడ్డి, ఎస్టీ యు జిల్లా అధ్యక్షులు బైరం హరి కిరణ్,నాల్గవ తరగతి సంఘ అధ్యక్షురాలు అరుణ, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డిపోలో ఉద్యోగి జలంధర్ రెడ్డి సేవలు అభినందనీయం



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 1 :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు 32 ఏళ్ల పాటు కంకణాల జలంధర్ రెడ్డి (కె.జె. రెడ్డి) ఉద్యోగిగా అందించిన సేవలు అభినంద నీయమని పలువురు ప్రశంసించారు. సోమవారం ఉద్యోగ విరమణ చేత సందర్భంగా పలువురు ఆయనను సన్మానించారు. 32 ఏళ్ల పాటు ఆర్టీసీలో ఉద్యోగిగా సేవలందించారు.స్థానిక మండలం కనుకులగిద్ద గ్రామానికి చెందిన కె.జె. రెడ్డి 1993లో ఐటీఐ ఫిట్టర్ పూర్తి చేసి ఆర్టీసీలో మెకానిక్గా ఉద్యోగంలో చేరారు. వేములవాడ డిపో మేనేజర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. "డ్రైవర్లకు ఏ బస్సులు కేటాయించాలి, బస్సుల మెయింటెనెన్స్ నిర్వహణ ఎలా ఉండాలనే విషయంలో జలంధర్ రెడ్డి సమయస్ఫూర్తి, అంకితభావంతో పనిచేశారని ప్రశంసించారు. సామాజిక కార్యకర్త,జిల్లా అవార్డు గ్రహీత కంకణాల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, తమ సోదరుడు అధికారుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఆర్టీసీకి 32 ఏళ్లపాటు నిష్కళంకమైన సేవలు అందించారని, ఇది తనకు తన కుటుంబ సభ్యులతో గర్వకారణం అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కె.జె. రెడ్డి తల్లిదండ్రులు, స్వాతంత్ర్య సమరయోధుడు కంకణాల రాజిరెడ్డి - అహల్య దంపతులను డిపో యాజమాన్యం ప్రత్యేకంగా సన్మానించింది.కె.జె. రెడ్డి సేవలను కొనియాడుతూ పదవీ విరమణ శు భాకాంక్షల పత్రంతో పాటు శాలువాతో డిపో అధికారులు, సహోద్యోగులు సత్కరించారు.?ఈ కార్యక్రమంలో పిఆర్వో శ్రీనివాస్ యాదవ్, ఏ ఎం ఎం ఆర్. రాంచందర్, వి ఆర్ ఓ, డిపో కార్మికులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొని ఉద్యోగ విరమణ చేసిన జలంధర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# యామపుర్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ (01) :** జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండలంలోని యామపుర్ గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ కనుక నాగేష్,కాంగ్రెస్ నాయకులు డీలర్లు మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.అనతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచనలతో మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించడం శుభ పరిణామమన్నారు. గత పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు జారీ చేయకపోగా, ఉన్న కార్డుల్లో కొన్నింటిని తొలగించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజాకర్షక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి అత్యధికంగా నిధులు తీసుకువస్తున్న నియోజకవర్గ ఇచార్జి, వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు,జువ్వాడి కృష్ణారావు లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో నాయకులు గడ్డం శంకర్ రెడ్డి, క్యాతం తిరుపతి రెడ్డి, మెర్గాడి గంగారెడ్డి,నాయిని గంగాధర్, బర్గాల రాజన్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ మునిసిపాలిటీకి అభివృద్ధి నిధులు ఇవ్వండి

**-మంత్రి శ్రీధర్ బాబును కలిసిన కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్, మున్సిపల్ పాలకవర్గం**

**-సానుకూలంగా స్పందించిన మంత్రి**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ సెప్టెంబర్ 1 :** హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబును హైదరాబాద్ లోని ఆయన నివాసం మంగళవారం కలిశారు. హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. వారి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన మంత్రి హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, తగిన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ జనాభాను, ఆదాయ వ్యయాలను, జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి శ్రీధర్ బాబు అడిగి తెలుసుకున్నారు. కార్యవర్గం అందించిన పలు ప్రతిపాదనలు స్వీకరించారు. పాలకవర్గాన్ని మంత్రి అభినందించారు. కార్యవర్గం అధికారులు సిబ్బంది ఐక్యతతో పనిచేయాలని, మునిసిపాలిటీని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని మంత్రి సూచించారు. కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్ జనంతో మమేకమై పనిచేస్తున్నారని మంత్రి ప్రశంసించారు. తమ మద్దతు ప్రోత్సాహం ఆయనకు ఎప్పుడూ ఉంటుందని.. ఇలాగే ముందుకు వెళ్లాలని, ప్రభుత్వ కార్యక్రమాలను అభివృద్ధిని సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ పాలకవర్గం పాల్గొన్నారు.

# ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**చురకలు ప్రతినిధి హుజురాబాద్, సెప్టెంబరు 1 :** భారత ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ 67వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు హుజురాబాద్ అంబుజా గ్యాస్ ఏజన్సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.ఏజెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ పివి మదన్ మోహన్ రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు గ్యాస్ వాడకంలో జాగ్రత్తలు మెళకువలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఇండేన్ సీనియర్ కస్టమర్ బోర్నపల్లి మాజీ సర్పంచ్ వేముగంటి రవీందర్ రావు మాట్లాడుతూ అంబుజా గ్యాస్ ఏజన్సీస్ గ్యాస్ ప్రమాదాల నివారణకు క్రమం తప్పకుండా అటు విద్యార్థులకు ఇటు గ్రామైక్య సంఘాలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని



అన్నారు.కళారవళి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు విష్ణుదాస్ గోపాల్ రావు మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ వ్యవస్థాపక దినోత్సవం సెప్టెంబరు ఒకటిన మహిళలకు వంట గ్యాస్ వాడకంపై అవగాహ కల్పించడం హర్షనీయమని, వినియోగదారులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని చైతన్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి మహిళ తోటి మహిళలకు అవగాహన కార్యక్రమం ద్వార నేర్చుకున్న అంశాలను చేరవేయాలని కోరారు.అంబుజా గ్యాస్ ఏజన్సీస్ అధినేత పి.వి.మదన్ మోహన్ అవగాహన కార్యక్రమంలో ఐఓసియల్ 67 సంవత్సరాల సుదీర్ఘమైన ప్రస్తానాన్ని వివరించారు. గ్యాస్ లీకేజి గమనిస్తే 1906 టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయాలని, కిచెన్ ప్లాట్‌ఫారమ్ కలిగి వుండాలని, వంటపని ముగియగానే స్టౌ నాబ్స్, రెగ్యులేటర్ నాబ్స్ ఆఫ్ చేయాలని, గ్యాస్ లీకేజీ వాసన వస్తే ఎటువంటి విద్యుత్ స్విచ్చులను వాడరాదని, వంటగదిలో వెంటిలేషన్ సరిగా వుండాలని సూచించారు. సిలిండర్ భౌతిక లక్షణాలను వివరించారు. బహిరంగ మార్కెట్‌లో 2500లకు లభించే 14.2 కేజీల సిలిండరును ప్రభుత్వం వేయి పైచిలుకు రూపాయలకు మాత్రమే అందిస్తున్నందున పొదుపుగా వాడాలని కోరారు. ఈకేవైసి ప్రతి ఒక్కరు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరాటే రమేశ్, మేనేజర్ దేవేందర్ రెడ్డి, సిబ్బంది పవన్, శరత్, భరత్,భరత్ రెడ్డి, ప్రభు, సురేశ్, నరేశ్, నరసయ్య మహిళా సంఘాల నేతలు కె.శ్రీదేవి, కె.స్వర్ణలత, జంపాల రమాదేవి, యండి. రిజ్వన్, శారద తదితరులు పాల్గొన్నారు.

# ఇరుమల్ల అంజమ్మ సేవలు చిరస్మరణీయం

**-పురావస్తు శాఖ జూనియర్ అసిస్టెంట్ అంజమ్మ పదవీ విరమణ కార్యక్రమంలో ఏడి సాగర్**



**కరీంనగర్ సెప్టెంబర్ 1 :** పురావస్తు శాఖలో మూడు దశాబ్దాలకు పైగా సేవలందించి పదవి విరమణ పొందిన అంజమ్మ ధన్యజీవి అని అవినీతి రహితంగా మంచికి మారుపేరుగా నిలిచి అందరి మన్ననలు పొంది ఈరోజు పదవి విరమణ పొందడం ఒకింతగా బాధ మరోరకంగా వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో వెలసిల్లాలని పురావస్తు శాఖ ఏడి సాగర్ అన్నారు. నగరంలోని గాయత్రీ నగర్ రోడ్ నెంబర్ 4 కు చెందిన ఇరుమల అంజమ్మ మల్లేశం దంపతులను పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏడి సాగర్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని అలాగే పురావస్తు శాఖలో తన ఉద్యోగ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని తన కుటుంబం కోసం జీవితాన్ని ఛనంగా పెట్టి ముగ్గురు కుమార్తెలను ఉన్నతమైన విద్యను అందించిన ఘనత అంజమ్మ మల్లేశం దంపతులకే దక్కుతుందన్నారు. ముగ్గురు కుమార్తెలని కుంగిపోకుండా వారి కోసం అహర్నిశలు శ్రమించి ఉన్నతమైన ఉద్యోగాలు వచ్చేలా విద్యను అందించడం ప్రస్తుత సమాజంలో అభినందనీయమన్నారు.అటెండర్ గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని మొదలుపెట్టి జూనియర్ అసిస్టెంట్ గా రిటైర్మెంట్ అయినా అంజమ్మ శేష జీవితం ఎలాంటి బాధరాబందీ లేకుండా సాఫీగా కొనసాగాలని అందరూ ఆకాంక్షించారు. గాయత్రి నగర్ రోడ్ నెంబర్ 4 పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు గొట్టిముక్కల కృష్ణ ప్రసాద్ తో పాటు కాలనీవాసులందరూ అన్యమను గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ యావత్తు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది, గాయత్రి నగర్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ ప్రభుత్వం

**-రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ సెప్టెంబర్ 1 :**

తెలంగాణలో అభివృద్ధికి మారుపేరు కాంగ్రెస్ ప్రభుత్వం అని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పరిపూర్ణమైన ప్రజాపాలన కొనసాగుతోందని... వెయ్యి రోజుల్లో గతంలోని భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కంటే వెయ్యిరెట్ల అభివృద్ధి జరుగుతోందని తెలంగాణ శాసనసభ వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ చైర్మన్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా భారీ ప్రదర్శన చేపట్టారు. నగరంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ సందర్భంగా మక్కాన్సింగ్ రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ వెయ్యి రోజుల పాలన సందర్భంగా రామగుండంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను వివరించారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో రామగుండంలో 900 కోట్ల రూపాయల నిధులతో ఊహించని అభివృద్ధి జరిగిందని స్పష్టం చేశారు. అన్ని రంగాలలో నగరాన్ని అభివృద్ధి దశలోకి తీసుకురావడమే తన ప్రధాన లక్ష్యమని రాజ్ ఠాకూర్ అన్నారు . నగరంలో చేపట్టిన భారీ ప్రదర్శన సందర్భంగా మక్కన్ సింగ్ కు అన్ని వర్గాల ప్రజలు, సంఘాలు, అభిమానులు అడుగడుగునా నీరాజనం పలికారు.

# నిర్మల్ జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలు

**-జిల్లా ఎస్పీ జానకి షర్మిల**



**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబర్, 01 :** ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు,ఊరేగింపులు, ధర్నాలు,నిరసనలు,బహిరంగ సభలు నిర్వహించరాదని జిల్లా ఎస్పీ. జానకి షర్మిల పేర్కొన్నారు.జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా ప్రశాంతతను దృష్టిలో ఉంచుకుని 01 సెప్టెంబర్ 2026 నుంచి 30 2026 సెప్టెంబర్ వరకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్ట్ సెక్షన్-30అమలులో ఉంటుందని ఎస్పీ.జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. సెక్షన్-30 అమలులో ఉన్న కాలంలో సంబంధిత పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, బహిరంగ సభలు, సమావేశాలు లేదా పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనే ఇతర కార్యక్రమాలు నిర్వహించరాదని ఎస్పీ సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే వారిపై సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అదేవిధంగా, సోషల్ మీడియా వేదికల ద్వారా తప్పుడు ప్రచారం,వదంతులు, మత విద్వేషాలు లేదా సామాజిక ఉద్రిక్తతలకు దారితీసే పోస్టులు, వీడియోలు, సందేశాలను ప్రచారం లేదా ప్రసారం చేసే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని, సభలు, సమావేశాలు లేదా ఇతర బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలనుకునే వారు సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లాలో శాంతిభద్రతలు, ప్రజా ప్రశాంతతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె కోరారు.

## అంజనీ తండా గ్రామ పంచాయతీలో
# కల్లు నిషేధ తీర్మానం



**చురకలు ప్రతినిధి,నిర్మల్, సెప్టెంబరు, 01 :** నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండలం అంజనీ తండా గ్రామ పంచాయతీలో కల్లు నిషేధానికి సంబంధించి గ్రామ పెద్దలు, సర్పంచ్, వార్డు సభ్యులు మరియు గ్రామస్తుల సమక్షంలో నర్సాపూర్ ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.గ్రామంలో కల్లు విక్రయాలు, సేవనాన్ని నియంత్రించి, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో కల్లు నిషేధ తీర్మానం చేశారు. గ్రామంలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కుటుంబాలు,యువత,సమాజంపై ప్రతికూలప్రభావం పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రామ పెద్దలు నిర్ణయించారు.ముఖ్యంగా యువత చెడువ్యసనాలకు లోను కాకుండా విద్య,ఉపాధి,క్రీడలు, ఆరోగ్యకరమైన జీవన విధానాల వైపు ప్రోత్సహించేందుకు గ్రామస్థులందరూ కలిసి పనిచేయాలని తీర్మానించారు. అంజని తండా గ్రామాన్ని మత్తు పదార్థాలకు దూరంగా ఉండే ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో శాంతియుత వాతావరణాన్ని నెల కొల్పడంతో పాటు, ప్రతి కుటుంబం ఆరోగ్యంగా,సంతోషంగా ఉండేలా సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కల్లు నిషేధ తీర్మానం అమలులో గ్రామ ప్రజల సహకారం ఎంతో అవసరమని, గ్రామంలోని యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామ అభివృద్ధికి,యువత సంక్షేమానికి, మత్తురహిత సమాజనిర్మాణానికి అంజని తండా గ్రామ పంచాయతీ తీసుకున్న ఈ నిర్ణయం ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎస్సై గణేష్,ఏఎస్సై శంకర్, సర్పంచ్ శ్రీను రాథోడ్,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు,మాజీ సర్పంచ్‌లు రుక్మాభాయి,జయ రాం నాయక్,మురళి నాయక్, యువత మరియు గ్రామస్తులు పాల్గొని కల్లు నిషేధ తీర్మానానికి తమ మద్దతు తెలిపారు.